సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 7 । మే । 2024



వ్యర్థాలకు నిప్పుతో ముప్పు
పంట వ్యర్థాలకు రైతులు ఇష్టారీతిన నిప్పు పెడుతున్నారు. దీంతో నిప్పురవ్వలు ఎగిసిపడి పక్కనున్న చేలపై పడడంతో కాలి బూడిదవుతున్నాయి.
IIలో▸



నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు
చెత్తతో సంపద సృష్టిపై పట్టింపు కరువైంది. గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రత్యేక పాలన గాడి తప్పిందనే విమర్శలున్నాయి.
IIIలో▸

గరిష్టం/కనిష్టం
41.0/28.0
వాతావరణం
ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది. పలుచోట్ల ఓ మోస్తరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డిగ్రీ పరీక్షలు షురూ



పరీక్ష కేంద్రంలోనికి వెళ్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వ విద్యాలయం డిగ్రీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తృతీయ సంవత్సరం విద్యార్థులకు 6వ సెమిస్టర్ పరీక్ష జరిగింది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రథమ సంవత్సరం సెకండ్ సెమిస్టర్ పరీక్ష నిర్వహించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. పరీక్ష కేంద్రాల్లో సరైన వసతులు లేక తంటాలు పడ్డారు. తాగు నీరు, ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కపోతతో అవస్థలు ఎదుర్కొన్నారు.

పంట నష్టపరిహారం విడుదల

ఆదిలాబాద్‌టౌన్: మార్చి నెలలో కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేసింది. జిల్లాలో 545.9 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు సర్వే చేసిన వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి అప్పట్లో నివేదిక అందజేశారు. జిల్లాలో 370 మంది రైతులకు సంబంధించిన పంటలు నష్టపోయినట్లు గుర్తించారు. ఒక్కో రైతుకు ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారాన్ని విడుదల చేసింది. జిల్లాలో ఇందుకు సంబంధించి రూ.54,52,250లను ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రకటించింది. అయితే కొంత మంది రైతులకు సోమవారం బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు సమాచారం.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఆదిలాబాద్‌టౌన్: ఖానాపూర్‌కు చెందిన న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. సివిల్ కేసులో తమకు వ్యతిరేకంగా వాదిస్తున్నారని కక్షతో ఖానాపూర్ న్యాయవాది మహేందర్‌పై దాడి చేశారని పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు నగేశ్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వివరాలు తెలుసుకుంటున్న మనోహర్

ఇంద్రవెల్లి: వేసవి దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అదనపు డీఎంహెచ్‌వో కుడ్మెత మనోహర్ అన్నారు. మండలంలోని దోడంద, ఈశ్వర్‌నగర్ గ్రామాల్లో సోమవారం ఏర్పాటు చేసిన మొబైల్ వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత నేపథ్యంలో మధ్యాహ్న సమయంలో అత్యవసరం అయితే తప్ప బయటకు రావదన్నారు. జనరల్ సర్జన్ సాయినాథ్, గైనకాలజిస్ట్ అంరీన్ షరీఫ్, వైద్యులు శ్రీకాంత్, సందీప్, తులసీదాస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారిని రిమ్స్‌కు రెఫర్ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులున్నారు.

ఓటర్ స్లిప్పులు తీసుకోండి

కైలాస్‌నగర్: ప్రతీ పోలింగ్ కేంద్ర పరిధిలో బీఎల్‌వోల ద్వారా ఓటర్ స్లిప్పులు పంపిణీ జరుగుతుందని, ఇంకా స్లిప్పులు తీసుకోని వారు ఈనెల 7, 8 తేదీల్లో స్థానిక బూత్‌స్థాయి అధికారిని సంప్రదించి తీసుకోవాలని ఆర్డీవో వినోద్ కుమార్ ప్రకటనలో కోరారు. ఓటర్లు ఎక్కడైతే తమ ఓటును వినియోగించుకుంటారో ఆ కేంద్రం వద్దనే బీఎల్‌వో పేరు, సెల్ నంబర్, తదితర వివరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు ఇంకా రెండు రోజులే సమయం ఉన్నందున ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, పోలీస్, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

సర్వేల హోరు



- పార్టీల వారీగా ప్రత్యేక కమిటీలు
- పార్లమెంట్ ఎన్నికల్లో తాజా పరిస్థితిపై ఆరా
- పార్టీ, ప్రత్యర్థుల బలాబలాలపై నివేదికలు
- వీక్‌గా ఉన్నచోట అధిష్టానాల ఫోకస్
- సరిదిద్దే యత్నాల్లో కీలక నేతలు

సాక్షి,ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజల ఆదరణ ఎంత శాతం ఉంది.. తమకెంత ఉంది.. తమ అభ్యర్థిని, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను జనం ఏ మేరకు ఆదరిస్తున్నారు.. సెగ్మెంట్ పరిధిలోని ఏయే నియోజకవర్గాల్లో బలంగా ఉన్నాం.. ప్రత్యర్థులు ఎక్కడ గట్టిగా ఉన్నారు.. ఈ పరిస్థితుల్లో ఎలా ముందుకెళ్లాలి.. లోటుపాట్లను ఎలా సరిదిద్దుకోవాలని ఆయా పార్టీల నుంచి సర్వే చేస్తున్న కమిటీలు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా రిపోర్టు అందించారు. ఆదిలాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి పార్టీల పరంగా ఆయా కమిటీలు ఇప్పటికే అధిష్టానాలకు నివేదికలు ఇచ్చాయి. ప్రచారానికి గడువు సమీపిస్తున్న తరుణంలో మిగిలిన రోజుల్లో ఆ లోపాలు అధిగమించాలని అక్కడి నుంచి ఆదేశాలు అందాయి. దీంతో అభ్యర్థులతో పాటు పార్టీ ఇన్‌చార్జీలు, ముఖ్య నేతలు ఇందులో తలమునకలయ్యారు. ప్రస్తుతం సర్వేల అలజడి కొనసాగుతుంది.

పార్టీ కమిటీల రిపోర్ట్..
బీజేపీ పరంగా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునిల్ బన్సల్ కమిటీ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిస్థితిపై కూడా ఇప్పటికే ఒకట్రెండు సార్లు నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. దాని ఆధారంగా లోటుపాట్లు సరిదిద్దుకునే చర్యలు ఇప్పటికే చేపడుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సునిల్ కనుగోలు కమిటీ నివేదికను తయారు చేసి ఇచ్చారు. బీఆర్‌ఎస్ నుంచి సివిక్స్ పోల్స్ అనాలసిస్ (సీ–ప్యాక్)కమిటీ రిపోర్టు ఇచ్చింది. ప్రధానంగా అందులో నియోజకవర్గం వారీగా పరిస్థితులను వివరించినట్లు సమాచారం. ఏయే నియోజకవర్గాల్లో పార్టీ, అభ్యర్థి బలంగా ఉన్నారు.. ఎక్కడ పార్టీ, అభ్యర్థి బలహీనంగా ఉన్నారు.. అక్కడ నష్ట నివారణకు చర్యలు చేపట్టాలి.. ఇందుకోసం ఆ నియోజకవర్గాల్లో ప్రత్యేక సమావేశాల నిర్వహణ, ఇన్‌చార్జీలు పూర్తిస్థాయిలో దృష్టి సారించి ఆ లోటుపాట్లను అధిగమించేలా ఆయా కమిటీలు ఇచ్చిన నివేదికల ఆధారంగా పార్టీల్లో చర్యలు చేపడుతున్నారు.

ఇంటెలిజెన్స్ నివేదికలు..
స్టేట్, సెంట్రల్ ఇంటెలిజెన్స్ శాఖలు కూడా పార్లమెంట్ ఎన్నికల్లో పరిస్థితులపై రిపోర్టు తయారు చేసినట్లు తెలుస్తోంది. ఈ రిపోర్టులు ప్రస్తుతం సంచలనం కలిగిస్తున్నాయన్న ప్రచారం సాగుతోంది. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్‌లు ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌పై ఉన్న పరిస్థితిపై నివేదిక ఇవ్వడంతో వాటి బలాబలాలు, బలహీనతలపై తీవ్ర చర్చ సాగుతోంది. ప్రధానంగా ముఖ్యనేతలు ఈ సర్వేల రిపోర్టులతో ఉరుకులు పరుగులు పెడుతున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో లోపాలను సరిదిద్దే విషయంలో చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. అంతలోపే వాటిని సరిదిద్దుకోగలుగుతామా.. లేదా అన్న మీమాంస వారిని వెంటాడుతుంది. మొత్తంగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ తేదీకి ముందు ఈ అంశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

గడువు రెండు రోజులే..

- పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగంపై ఉద్యోగుల అనాసక్తి
- ఇప్పటి వరకు సగం మంది మాత్రమే వినియోగం

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు ముందుగానే తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికలు జరగనుండగా వీరికి ఈ నెల 4నుంచి 8వ తేదీ వరకు ఓటేసేందుకు గడువు విధించింది.అయితే ఇప్పటి వరకు సగం మంది కూడా ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో కలిపి 4,914 మంది ఓటర్లుండగా ఇప్పటి వరకు 2,183 మంది మాత్ర మే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇంకా 2,731 మంది ఓటు వేయాల్సి ఉంది. మరో రెండు రోజులే గడువు ఉండటంతో వందశాతం పోస్టల్ బ్యాలెట్ ఓటు నమోదవుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆదిలాబాద్ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 3,350 మంది ఓటర్లు ఉండగా అందులో ఇప్పటి వరకు 1,514 మంది మాత్రమే ఓటు వేశారు.
- బోథ్ నియోజకవర్గంలో 1,564 మంది ఉండగా కేవలం 669 మంది మాత్రమే ఓటు వేశారు. జిల్లాలో ఎండలు దంచికొడుతుండటంతో పాటు వడగాలుల తీవ్రత అధికంగా ఉండటం, బోథ్ నియోజకవర్గంలో విధులు నిర్వహించే ఉద్యోగులు జిల్లా కేంద్రంలోనే నివాసం ఉంటుండటంతో ఓటు వేసేందుకు వారు అంతగా ఆసక్తి చూపనట్లుగా తెలుస్తోంది. మొత్తానికి పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై ఎండల ప్రభావం కనిపిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న డీఎస్పీ
ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది కోసం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు.



ఓటు హక్కు వినియోగించుకున్న డీఎస్పీ

స్ట్రాంగ్ రూంల్లో ఈవీఎంలు భద్రం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పోటీలో నిలిచిన అభ్యర్థుల గుర్తులను అమర్చిన ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో గల స్ట్రాంగ్‌రూంల్లో భద్రపరిచారు. జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో ఈవీఎంలను జిల్లా రిటర్నింగ్ అధికారి రాజర్షి షా, సహాయ రిటర్నింగ్ అధికారి ఖుష్బూ గుప్తా సమక్షంలో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి సీల్ వేశారు. వాటిని పోలింగ్‌కు ముందు రోజున ఆయా నియోజకవర్గాల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందికి అప్పగించనున్నారు. స్ట్రాంగ్ రూం వద్ద సాయుధ బలగాలు భద్రతను పర్యవేక్షించనున్నాయి.



స్ట్రాంగ్‌రూంకు సీల్ వేయడాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, అభినందిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, డీఈవో ప్రణీత

- కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ప్రశంస పత్రాలు అందజేసి అభినందంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10 జీపీఏ సాధించడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. దిశానిర్దేశం చేసి ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు. ఇందులో డీఈవో ప్రణీత, మండల విద్యాధికారి జయశీల, సైన్స్ అధికారి రఘురమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో మెరుగైన వైద్యసేవలు

- డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ఈ మేరకు ఆస్పత్రిలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆస్పత్రిలో పీడియాట్రిక్ సర్జరీ, పాస్టిక్ సర్జరీ, సర్జికల్ అంకాలజీ, కార్డియాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ఓపీ ద్వారా 500 మందికి సేవలు అందిస్తున్నామని తెలిపారు. అలాగే కిడ్నీ, క్యాన్సర్ సంబంధిత వ్యాధులకు చికిత్స అందిస్తున్నామన్నారు. త్వరలో క్యాథ్‌ల్యాబ్ ద్వారా అంజియోగ్రామ్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. రిమ్స్‌లో ఎంబీబీఎస్ కోర్సు కోసం 120 సీట్లు ఉండగా, మరో 50 సీట్ల పెంపు కోసం ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఏటా 72 పీజీ సీట్లు మంజూరవుతున్నాయని, వీటి సంఖ్య పెంపు కోసం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రిమ్స్‌లోని ఓపీ గైనకాలజీ వార్డులో అల్ట్రాసౌండ్ సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మోకాళ్ల చిప్ప మార్పిడిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు మధులిక, రాజేశ్, దేవిదాస్, విజయ్‌మోహన్, శ్రీకాంత్, ఇద్రిస్ అక్బాని,కళ్యాణ్‌రెడ్డి, చంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

వినియోగదారులకు నాణ్యమైన సేవలు

- విద్యుత్ శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్‌టౌన్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందిస్తున్నామని ఆ శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్ అన్నారు. విద్యుత్ వినియోగదారుల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రమాదాల నివారణ కోసం ప్రతీ ఇంట్లో తప్పనిసరిగా ఎర్తింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు. సర్వీసు వైర్లు, ఇంట్లో ఉండే వైర్లను జాయింట్లు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఎక్కడైనా స్పార్క్ అయితే వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. వేలాడే తీగలు ఉంటే వాటిని ముట్టుకోకుండా సిబ్బందికి సమాచారం అందిస్తే వాటిని సరిచేస్తారని పేర్కొన్నారు. జిల్లాకు వర్ష సూచనల నేపథ్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 9440811700 నంబర్‌పై సంప్రదించాలని సూచించారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో డీఈలు హరికృష్ణ, సుభాష్, ఈదన్న, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‘వేడి’

- భానుడి ప్రతాపంతో చిన్నారులు, గర్భిణుల ఇక్కట్లు
- పలు కేంద్రాల్లో ఫ్యాన్లు కరువు
- ఉక్కపోతతో సతమతం

జిల్లాలో అంగన్‌వాడీ ప్రాజెక్టులు: 05
అంగన్‌వాడీ కేంద్రాలు : 1256
చిన్నారులు: 13,500
గర్భిణులు, బాలింతలు: 8వేలు



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. పగటిఉష్ణోగ్రతలు 45 డిగ్రీల చేరువలో ఉన్నాయి. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించగా అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగుతున్నాయి. అయితే కేంద్రానికి వచ్చే వారు వేడి, ఉక్కపోతతో అల్లాడుతున్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రాలకు పంపడం లేదు. ఇతర పనులకు వెళ్లే వారు మాత్రం పంపక తప్పని పరిస్థితి. పౌష్టికాహారం కోసం గర్భిణులు, బాలింతలు సెంటర్లకు వెళ్తున్నారు. వీరితో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎండ తీవ్రతతో నరకయాతన పడుతున్నారు. జిల్లాలో చాలా కేంద్రాలకు సొంత భవనాలు లేవు. అద్దె గదుల్లోనే కొనసాగుతున్న వాటిలో సౌకర్యాలు లేకపోవడం గమనార్హం.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
జిల్లా కేంద్రంలో దాదాపు అన్ని కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. మిగతా గ్రామీణ ప్రాంతాల్లో జీపీ భవనాలు, పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థల భవనాలు, మిగతావి సొంత భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఈ వేసవిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అయితే ఈనెల నుంచి ఆయాలకు 15 రోజులు, టీచర్లకు 15 రోజుల చొప్పున సెలవులు ప్రకటించారు. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్లకు సెలవులు ఉండగా, ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు.

సౌకర్యాలు కరువు..
జిల్లాలోని చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు కరువయ్యాయి. చిన్న చిన్న గదులు ఉండడంతో కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఫ్యాన్లు సైతం తిరిగే పరిస్థితి లేదు. కొన్ని కేంద్రాలకు కరెంట్ ఉన్నప్పటికీ ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కపోత భరించలేకపోతున్నారు. కొన్నిచోట్ల మరుగుదొడ్లు కరువయ్యాయి. ఆరోగ్యలక్ష్మి భోజనం కోసం చిన్నారులతో వచ్చే తల్లులు, గర్భిణులకు అవస్థలు తప్పడం లేదు.

తగ్గుతున్న హాజరు..
వేసవి దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారుల హాజరు తగ్గుతుంది. ఉదయం 8 గంటలకు కేంద్రాలు తెరుస్తున్నప్పటికీ చిన్నారులు రావడం లేదు. 10 గంటల సమయంలో ఆయాలు వారిని కేంద్రాలకు తీసుకెళ్తున్నప్పటికీ అద్దె గదుల్లో చిన్నారులు వేడి తట్టుకోలేకపోతున్నారు. ఏసీలు, కూలర్లు ఉన్న ఇళ్లలోనే కూర్చోలేని పరిస్థితి ఉండగా సౌకర్యాలు లేని కేంద్రాలు లబ్ధిదారులు లేక వెలవెలబోతున్నాయి. దీంతో కొంత మంది అంగన్‌వాడీలు ఆరోగ్యలక్ష్మి ద్వారా భోజనాన్ని వండిపెట్టడం లేదు. ఇంకొన్ని కేంద్రాల్లో భోజనం వండిపెడితే బాక్సుల ద్వారా ఇంటికి తీసుకెళ్తున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని, లబ్ధిదారుల ఇంటికే సరుకులు అందించాలని చెబుతున్నారు.

భోజనం పెట్టి పంపించేలా చూస్తున్నాం



జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉన్న మాట వాస్తవమే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు కేంద్రాలను నడిపిస్తున్నాం. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఉదయం పూట ఆటపాటలతో చదువు చెప్పి భోజనం పెట్టిన తర్వాత పంపించేలా చూస్తున్నాం. 15 రోజుల పాటు టీచర్లకు, ఆ తర్వాత 15 రోజులు ఆయాలకు వేసవి సెలవులు ఉన్నాయి.
– సబిత, జిల్లా సంక్షేమ అధికారి

సక్కును గెలిపించాలని ప్రచారం



చోర్‌గావ్‌లో ప్రచారంలో పాల్గొన్న జెడ్పీచైర్మన్

నార్నూర్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుకు మద్దతుగా జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ సోమవారం ప్రచారం చేపట్టారు. మండలంలోని చోర్గావ్, సుంగాపూర్, ఉమ్రీ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గడిచిన పదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ సక్కును గెలిపించాలని కోరారు. ఇందులో ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్, నాయకులు జాదవ్ శ్రీరాం నాయక్, సురేశ్, రమేశ్, విష్ణు, సుభాష్ పాల్గొన్నారు.

మేడే ముగింపు సభ జయప్రదం చేయండి

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గార్డెన్‌లో నేడు నిర్వహించనున్న మేడే వారోత్సవాల ముగింపు సభ జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కోరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సభ సందర్భంగా మహా కార్మిక ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఉదయం 9 గంటలకు యూనియన్ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ సెంట్రల్ గార్డెన్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించనున్న సభకు యూనియన్ జాతీయ నేత ఎం.సాయిబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. యూనియన్, అనుబంధ రంగాల కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఇందులో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, జిల్లా కమిటీ సభ్యులు పొచ్చన్న, నాయకులు దశాంత్, వినీత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిరణ్

క్లుప్తంగా

వ్యాపారిపై మనీ ల్యాండరింగ్ కేసు?

నేరడిగొండ: ఇటీవల మండల కేంద్రంలో నలుగురు వ్యాపారుల వద్ద తనిఖీలు నిర్వహించిన పోలీసులు అందులో ఒకరిపై మనీ ల్యాండరింగ్ కేసు నమోదు చేసినట్లు సమాచారం. అయితే ఈ కేసు వెనుక మర్మమేమిటో తెలియక ప్రజలు స్థానిక పోలీసులపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బడా వ్యాపారుల వద్ద భారీగా లావాదేవీలు జరిగినట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయంలో గోప్యత పాటించడం పట్ల 'మామూలుగా' తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



కాంస్య పతకంతో చౌహాన్ జేతాలాల్

కుంటాల: మండల కేంద్రానికి చెందిన ఐదోతరగతి విద్యార్థి చౌహాన్ జేతాలాల్ ఈ నెల 4 నుంచి 6 వరకు గోవాలో నిర్వహించిన జాతీయస్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించాడు. యూత్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గతేడాది ఆగస్టు 5 నుంచి 10 వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. సదరు విద్యార్థిని విజయసాయి పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, వైస్ ప్రిన్సిపాల్ మురళి, పీఈటీ రాథోడ్ అరవింద్ అభినందించారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఎదులాపురం: శాసన సభ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉపకులాల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జాదవ్ శేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేసి చైర్మన్‌గా బైరి వెంకటేశంను నియమించాలన్నారు. దీంతో దళితుల్లో అత్యంత వెనుకబడ్డ 57 ఉపకులాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

ఆదిలాబాద్‌టౌన్: అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాలల పర్యవేక్షణ కోసం సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ జిల్లాకు ప్రత్యేక అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఆర్‌వీఎం రాష్ట్ర ప్లానింగ్ కోఆర్డినేటర్ యు.సంపత్‌రావును పర్యవేక్షణ అధికారిగా నియమించారు. ఈయన వారానికోసారి పాఠశాలలను తనిఖీ చేస్తూ ఆ కమిటీల ద్వారా జరిగే పనులను పర్యవేక్షించాల్సి ఉంటుంది.

వ్యర్థాలకు నిప్పుతో ముప్పు



కాలిన జొన్నపంటను చూపుతున్న రైతులు

- చేతికి అందివచ్చిన పంటలు కాలిపోతున్న వైనం
- దగ్ధమవుతున్న వ్యవసాయ సామగ్రి
- ఆర్థికంగా నష్టపోతున్న రైతన్నలు

తాంసి: యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలు ఇప్పుడిప్పుడే చేతికొస్తున్నాయి. ప్రధానంగా జొన్న, గోధుమ, వేరుశనగ, పెసర, మినుము, నువ్వు పంటలు అధికంగా సాగుచేశారు. కానీ ముందస్తుగా సాగుచేసిన రైతులు భూములను చదును చేసేందుకు పంట వ్యర్థాలకు ఇష్టారీతిన నిప్పుపెడుతున్నారు. దీంతో నిప్పురవ్వలు ఎగిసిపడి పక్కనున్న పంటచేలపై పడడంతో చేతికి అందివచ్చిన పంటలు కాలి బూడిదవుతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

వరుస ప్రమాదాలు

తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇటీవల పొన్నారి గ్రామానికి చెందిన రైతు గట్టు గంగన్న చేను పక్కనే ఉన్న రైతు తమ పంటచేలలో వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో నిప్పురవ్వలు ఎగిరిపడి ఏడెకరాల్లో జొన్నపంట కాలిపోయింది. సమీపంలోని రైతులు సకాలంలో స్పందించి ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేయడంతో నష్టం తీవ్రత తగ్గింది. తాంసిలో రైతు అశోక్‌కు చెందిన రెండెకరాల్లో జొన్న పంట సైతం అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. గిరిగాం శివారులోని పంటచేలలో జరిగిన ప్రమాదంలో స్ప్రింక్లర్ పైపులు కాలిబూడిదయ్యాయి. ఈ విషయంలో రైతులు ఆలోచించి వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా జాగ్రత్తలు పాటిస్తే బాగుంటుంది. వ్యవసాయశాఖ అధికారులు సైతం క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి వ్యర్థాలను కలియదున్నే విధంగా చూడాలి. వ్యర్థాలు కలియదున్నడం వలన కలిగే లాభాలను సైతం రైతన్నలకు తెలియజేస్తే పంట దిగుబడి పెరిగి మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. పంట వ్యర్థాలకు నిప్పు పెట్టే రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పరిహారం అందించాలి



ఈ యాసంగి సీజన్‌లో నాలుగెకరాల్లో జొన్నపంట వేశా. పక్కనున్న పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో రెండెకరాల్లో జొన్నపంట కాలిపోయింది. దాదాపు రూ.50వేల వరకు నష్టం వాటిల్లింది. అధికారులు పరిశీలించి పరిహారం అందించాలి.

– బెల్లపు అశోక్, రైతు, తాంసి

వ్యర్థాలను తగులబెట్టొద్దు



రైతులు పంట దిగుబడులు వచ్చిన తరువాత తగులబెట్టొద్దు. దీనివల్ల భూసారం తగ్గుతుంది. నాగళ్లతో భూమి లోపలికి వెళ్లేలా కలియదున్నాలి. దీంతో భూసారం పెరిగి పంటలకు అవసరమైన పోషకాలు అందుతాయి. ఏఈవోల ద్వారా రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, ఏడీఏ, తాంసి

సరిలేరు నీకెవ్వరు..



అంబలి పోస్తున్న జనార్దన్

- అంబలి సేవలో తొమ్మిదేళ్లు
- ఆదర్శంగా నిలుస్తున్న జనార్దన్

ఖానాపూర్: వేసవిలో మండుటెండల్లో ఖానాపూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే వారికి పట్టణానికి చెందిన జనార్దన్ అంబలి పోసి ఆకలి తీరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. పట్టణంలోని సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా (లేఖరిగా) పనిచేస్తున్న పల్లికొండ జనార్దన్ తాను సంపాదించిన దాంట్లోంచి కొంత సామాజిక కార్యక్రమాలకు వెచ్చిస్తున్నాడు. ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా రాజకీయాలకతీతంగా తొమ్మిదేళ్లుగా సామాజిక సేవచేస్తూ అందరి మన్ననలు పొందుతూ పలువురికి మార్గదర్శిగా నిలుస్తున్నాడు. ఏటా వేసవి ప్రారంభం కాగానే మూడు నెలల పాటు ప్రజలకు అంబలిని అందిస్తున్నారు.

రద్దీ పెరిగినా వెనక్కి తగ్గకుండా...

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు గతంలో అంతగా జనం వచ్చేవారు కాదు. ప్రస్తుతం ప్రభుత్వం ఉచితంగా ఆర్టీసీ సేవలు పెంచడంతో రద్దీ పెరిగింది. అయినప్పటికీ ప్రతీరోజు వెయ్యిమందికి పైగా జనానికి ఉచితంగా అంబలి అందిస్తున్నాడు. దీనికి తోడు రూ.50 వెచ్చించి ఆర్టీసీ బస్టాండ్‌లో కూల్ వాటర్ ఫ్రీజర్ ఏర్పాటు చేసి ప్రజల దాహం తీరుస్తున్నాడు. 7 పదుల వయస్సులోనూ అధైర్యపడకుండా తన సేవలు కొనసాగిస్తున్నాడు.

అంబలితో ఆరోగ్యం...

అంబలి తాగడం ద్వారా వేడిమి నుంచి చల్లదనం పొందడంతో పాటు ఎన్నో పోషక విలువలు అందుతాయి. దీంతో చిన్నా, పెద్ద తేడా లేకుండా అంబలి సేవిస్తున్నారు.

భవిష్యత్‌లోనూ అందిస్తా..



నాటి కాలంలో ప్రతీ వేసవిలో అంబలి తాగడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు వడదెబ్బల నుంచి ఉపశమనం పొందేవారు. తొమ్మిదేళ్ల క్రితం కార్యక్రమం చేపట్టా. భవిష్యత్తులోనూ అందిస్తా.

– పల్లికొండ జనార్దన్, అంబలి దాత

కొన్నేళ్లుగా తాగుతున్నాం



ఆర్టీసీ బస్టాండ్‌లో జనార్దన్ ఉచితంగా అందించే అంబలిని కొన్నేళ్లుగా తాగుతున్నాం. వేసవి వచ్చిందంటే బస్టాండ్‌లో జనార్దన్ అంబలి ఉంటుందని గుర్తుకు వస్తుంది. ఎన్ని పనులున్నా వదిలివెళ్లి అంబలి తాగుతున్నాం.

– కరిపె రాజశేఖర్, ఖానాపూర్

ప్రచారంలో పాల్గొన్న గుజరాత్ ఎమ్మెల్యే



ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ నాయకులు

గుడిహత్నూర్: ఏక్ దిన్ మోదీకే నామ్ పేర బీజేపీ నాయకులు సోమవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో గుజరాత్‌లోని దోధ్ ఎమ్మెల్యే గోవర్ధన్ వర్మ పాల్గొన్నారు. మరోసారి మోదీ ప్రధానికావడం ఖాయమని, ఆదిలాబాద్ నుంచి గోడం నగేష్ సైతం భారీ మెజార్టీతో గెలుస్తున్నాడని ఆయన జోస్యం చెప్పారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, పార్టీ మండలాధ్యక్షుడు కేంద్రే శివాజీ, వైస్ ఎంపీపీ భరత్, నాయకులు కేంద్రే లక్ష్మణ్, జాడి సుభాష్, సుధాకర్‌రెడ్డి, వామన్‌గిత్తే, చాటే సంభాజీ, శైలేందర్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

బిడ్డను చూడకుండానే కన్నుమూసిన తల్లి

- ఆస్పత్రిలో బాలింత మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆందోళన
- పోలీసుల జోక్యంతో విరమణ



రవళిక (ఫైల్)



ఆందోళన కారులతో మాట్లాడుతున్న సీఐ బన్సీలాల్

మంచిర్యాలక్రైం: నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చిన ఓ తల్లి కళ్లనిండా చూసుకోకుండానే కాటికి చేరుకున్న ఘటన సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం బెల్లంపల్లికి చెందిన బొల్లు వెంకటేశ్ భార్య రవళిక (26) సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని నందిని ఆస్పత్రిలో ప్రసవం నిమిత్తం చేరింది. ఆస్పత్రి వైద్యురాలు సాధారణ డెలివరీ చేయడంతో బాబుకు జన్మనిచ్చింది. సదరు మహిళకు అధిక రక్తస్రావం కావడంతో వైద్యురాలు అర్జంటుగా రక్తం కావాలని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపింది. వెంకటేశ్ బ్లడ్ బ్యాంకుకు వెళ్లి రక్తం తీసుకు వచ్చేలోగానే వైద్యురాలు నందిని బాధిత కుటుంబ సభ్యులకు చెప్పకుండానే మహిళను సమీపంలోని మెడిలైఫ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవళిక మృతి చెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యురాలు నందిని, మెడిలైఫ్ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే రవళిక మృతి చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న సీఐ బన్సీలాల్ సిబ్బందితో కలిసి ఆసుపత్రి వద్దకు చేరుకుని బాధితులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం


- భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

నిర్మల్‌టౌన్: ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్యకు యత్నించిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ కాలనీకి చెందిన గాందేవార్ కృష్ణమూర్తి, పుష్పలత (56) దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. కుమారుడు బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కృష్ణమూర్తి ప్రస్తుతం ఇచ్చోడ మండలం పిప్రి గ్రామంలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దీంతోపాటు అదనంగా చిట్టీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. వ్యాపారంలో తీవ్రనష్టం వాటిల్లింది. అంతేకాకుండా కుమారుడు ప్రేమ వివాహం చేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. సోమవారం ఉదయం స్థానిక బంగల్‌పేట్ కాలనీలోని వినాయక్ సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వారిని బయటకు తీశారు. అప్పటికే పుష్పలత మృతి చెందగా కృష్ణమూర్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన కొండ విఠల్ (65) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. మృతుడు కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ నెల 1న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఉరేసుకుని ఒకరు..




సురేష్ మృతదేహం

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన నామ్మల సురేష్ (30) మద్యానికి బానిసై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై దిగంబర్ తెలిపారు. సురేష్ కొంత కాలంగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండేవాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించి గ్రామంలోని శ్మశాన వాటికలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం మృతుని భార్య నామ్మల వర్షిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై..

కౌటాల: మండలంలోని గురుడుపేటకు చెందిన బొగరపు భీంరావు(35) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్ మధుకర్ తెలి పారు. మద్యం మత్తులో భార్యతో గొడవపడుతుండడంతో నెలరోజుల క్రితం తన ఇద్ద రు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం సాయంత్రం అతిగా మద్యం తాగి ఇంటిముందున్న సెల్‌టవర్ ఎక్కడంతో స్థానికులు గమనించి వారించడంతో కిందకు దిగాడు. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో సెల్‌టవర్ ఎక్కడంతో ప్రమాదవశాత్తు జారి పడడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మధుకర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించారు. ఆత్మహత్యకు గల కారణా లు అడిగి తెలుసుకున్నారు. మృతునికి భార్య సౌజన్య, కుమారుడు శాన్విక్, కుమా ర్తె శాన్వి ఉన్నారు. మృతుని తల్లి కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మధుకర్ తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..



జోగేంద్ర మృతదేహం

సోన్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన జోగేంద్ర (30) సోన్ మండల కేంద్రంలో పదేళ్లుగా హోటల్ నడిపేవాడు. అంతేకాకుండా చిట్టీలు కూడా నడిపించేవాడు. చిట్టీలలో నష్టం రావడంతో సభ్యులకు డబ్బులు చెల్లించలేక మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో కొక్కానికి నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఖానాపూర్ నుంచి సత్తన్‌పల్లి వైపు వెళ్తున్న ఆటోకు ఎద్దు అడ్డురావడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఘటనలో పలువురికి గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులకు ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌కు రెఫర్ చేశారు.

గ్రీన్‌బక్కెట్ పార్శిల్ హోటల్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని గ్రీన్ బక్కెట్ బిర్యానీ పార్శిల్ హోటల్‌లో సో మవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో చోరీ జరిగింది. హోటల్ వెనుక భాగం నుంచి ఓ బాలుడు లోనికి చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు ఆ హోటల్ యజమాని నాగేంద ర్ తెలిపాడు. ముగ్గురు వ్యక్తులు బయట ఉ న్నట్లు సీసీ పుటేజీలో రికార్డు అయినట్లు తెలి పాడు. మొత్తం రూ.8వేల నగదుతో పాటు ఒక సెల్‌ఫోన్ దొంగలించినట్లు వివరించాడు. కాగా చోరీకి పాల్పడిన బాలుడు నిర్మల్‌లో పట్టుబడినట్లు తెలిపాడు. ఈ నలుగురే ఇదివరకు రెండుసార్లు తమ హోటల్‌లో చోరీకి పాల్పడినట్లు వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బాగులవాడ వాల్మీకినగర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇ ల్లు దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. కా లనీకి చెందిన బోనగిరి లక్ష్మణ్ ఇంట్లో సోమవా రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పి వేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రితో పాటు నిత్యావసర సరుకులు దగ్ధమయ్యాయి. ఘటనలో సుమారు రూ.1.50 లక్షల ఆస్తినష్టం జరి గిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

బల్దియా ఆటో దగ్ధం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ చెత్తసేకరణ చేసే ఆటో అగ్నికి ఆహూతి అయ్యింది. రో జులాగే సోమవారం కాలనీలో తిరుగుతూ చెత్త సేకరించింది. ఆ తర్వాత ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడలో గల డంపింగ్ యార్డు కు చెత్తను పడేయడానికి వెళ్లింది. ఈ క్రమంలో ఎండతీవ్రతకు ఆటోలోని ఇంజన్ వేడెక్కి మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి ఫైరింజన్‌కు సమాచారం అందించినా సిబ్బంది వచ్చేసరికి ఆటో పూర్తిగా కాలిపోయింది.

గంజాయి స్వాధీనం

తాంసి: భీంపూర్ మండలంలోని బెల్సరీ రాంపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రదీప్ కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం గ్రామంలో తనిఖీలు చేపట్టగా గ్రామానికి చెందిన దాంజీ, భీంరావు నివాసాల్లో గంజాయిని గుర్తించారు. వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.1.28 లక్షలు ఉంటుందని ఎస్సై తెలిపారు.

ఒకరి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని క్రాంతినగర్‌లో జరిగిన ఘటనకు సంబంధించి పద్మావర్ రాకేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. కాగా సంఘటనకు సంబంధించి 40 మందిపై కేసులు నమోదు చేయగా పలువురిని అరెస్టు చేశారు.

పెళ్లింట విషాదం

- కూతురును అత్తారింటికి సాగనంపి గుండెపోటుతో తండ్రి మృతి

చెన్నూర్: అప్పటి వరకు కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులతో సందడిగా ఉన్న ఆ ఇంట్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. కూతురికి అంగరంగ వైభవంగా వివాహం జరిపించి అత్తారింటికి పంపించిన ఆ తండ్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందిన సంఘటన చెన్నూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పబ్బావాడలో నివాసం ఉంటున్న మహ్మద్ ఎజాస్ (60) మెయిన్ రోడ్డులో జనరల్ స్టోర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రా త్రి పెద్దకుమార్తె వివాహ వేడుకలను స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. అనంతరం సంప్రదాయం ప్రకా రం కుమార్తెను అత్తారింటికి సాగనంపి ఇంటికి చేరుకున్నాడు. తెల్లవారుజామున చాతి లో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

విషపురుగు కాటుతో బాలుడు మృతి

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దనపల్లి న్యూ కాలనీ పక్కనే ఉన్న మామిడితోటలో సోమవారం విషపురుగు కాటుతో రాంకరణ్ దుర్గేష్ (5) మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన రాంకరణ్ రాంప్రసాద్ తన భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి పెద్దనపల్లి శివారులో న్యూకాలనీ వద్ద ఉన్న మామిడి తోటలో కాయలు తెంపేందుకు ఆదివారం రాత్రి వెళ్లారు. సోమవారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి దుర్గేష్ కుడిచేతి మట్టపై వాపు కనిపించింది. వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.